జోరు వాన

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండలంలోని వెలిగండ్లలో గోకులం మొగల్లూరు మరపుగుంట్ల రామలింగాపురం రామగోపాలపురం తదితర ప్రాంతాలలో ఊహించకుండా ఒక్కసారిగా గాలివాన బీభత్సం సృష్టించింది. వాన ఎడతెరిపి లేకుండా కురవటంతో ప్రజలు ఇల్ల వద్దకే పరిమితమై ఎండలు మండిపోతుండటంతో ఈ వాన కొంతమేర ప్రజలకు ఉపశమనం కలిగించవచ్చని భావిస్తున్నారు. మే నెల మొదలుకొని ఎండలు 48 డిగ్రీల వరకు రావడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయితే ఎండలు ఏలా తప్పించుకోవాలో అనుకుంటున్న తరుణంలో ఈ వర్షం ప్రజలకు కొంత ఉపశమనం కలిగించినప్పటికీ వేడి పొంగి రోగాల బారిన పడే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

అంకమ్మ గుడి నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం

విశాలాంధ్ర-తాళ్లూరు : మండలంలోని బెల్లంకొండవారిపాలెం గ్రామంలోని ఎస్టీ కాలనీలో ఉన్న అంకమ్మ తల్లి గుడి నిర్మాణానికి టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి 10 లక్షల విరాళం ప్రకటించినట్లు మాజీ ఎంపీపీ రాష్ట్ర వైసీపీ సంయుక్త కార్యదర్శి పి.మధుసూదన్ రెడ్డి తెలిపారు. గత కొంతకాలంగా ఎస్టి కాలనీ వాసుల ఆరాధ్య దైవమైన అంకమ్మ తల్లి గుడి పాతదిగా ఉండడంతో దాని నిర్మాణ పనులకు నిధులు కేటాయించవలసిందిగా మధుసూదన్‌రెడ్డి టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డిని కోరారు. దీనిపై స్పందించిన చైర్మన్ సుబ్బారెడ్డి గుడి నూతన నిర్మాణానికి 10 లక్షల విరాళం ప్రకటించారు. అదేవిధంగా గ్రామంలోని పోలేరమ్మ తల్లి గుడి నిర్మాణానికి కూడా త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తామని మాట ఇచ్చినట్లు మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

శ్రద్ధపెట్టి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి

విశాలాంధ్ర-టంగుటూరు : శ్రద్ధపెట్టి చదివితే ఉన్నత శిఖరాలు అందుకోవచ్చని స్థానిక గ్రంథ పాలకులు గుమ్మడి వర్ధన్‌రాజు అన్నారు. గురువారం స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ అధ్యాపకులు నిమ్మల వెంకయ్య విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్ బోధించారు. అనంతరం విద్యార్థులకు బిస్కెట్స్, డ్రింక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు 29 మంది హాజరైనట్లు గ్రంథ పాలకులు గుమ్మడి వర్ధన్‌రాజు తెలిపారు.

బెల్లం జయంతి బాబు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-టంగుటూరు : మాజీ సర్పంచ్, ప్రముఖ పారిశ్రామికవేత్త బెల్లం జయంతి బాబు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. మున్ముందు మరెన్నో సేవా కార్యక్రమాలు చేసి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అధిక సంఖ్యలో హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

సర్వీస్ పాయింట్లు కేటాయించాలి

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు సర్వీస్ పాయింట్లు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక డిఇఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎపిటిజి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె వెంకట్రావు, సిహెచ్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం మార్చిలో ఎయిడెడ్ పాఠశాలల నుంచి ప్రభుత్వంలోకి విలీనమైన ఉపాధ్యాయులకు కొన్నిచోట్ల వారు కోరుకున్న పాఠశాలలో కొన్ని పాఠశాలలు దగ్గరలోనే ఉన్నత పాఠశాలలో విలీనమై వీరు ఆ పాఠశాలలో జూనియర్ గా సర్‌ప్లస్ టీచర్‌గా తెలిపారన్నారు. కనుక వీరికి ప్రభుత్వం సర్వీస్ పాయింట్ కేటాయించి కౌన్సిలింగ్ నందు పాల్గొనేలా జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

బండలాగుడు పోటీలను ప్రారంభించిన గంగసాని

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని మోపాడు రిజర్వాయర్ వద్ద వెలిసియున్న గంగాభవాని తిరునాళ్ల ముగింపు సందర్భంగా గురువారం సాయంత్రం నిర్వహించిన ఎడ్ల బండలాగుడు పోటీలను వైసీపీ మండల అధ్యక్షులు గంగాసాని హుస్సేన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ నెల 14వ తేదీ నుండి ప్రారంభమైన గంగాభవాని తిరునాళ్లు విజయవంతముగా జరిగాయి. గురువారం గంగమ్మ తల్లికి పాల పొంగళ్ళు సమర్పించి తమ మొక్కలను భక్తులు తీర్చుకున్నారు.

పీహెచ్‌సీ వైద్యుల నిర్లక్ష్యంతో గర్భిణి మృతి..!

పోలీసుల మోహరింపు, వాగ్వివాదం

పోలీసులు బాధితుల మధ్య వాగ్వివాదం, (ఇన్‌సెట్)లో మృతిచెందిన గర్భిణి సంధ్య

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు పెంచి సామాన్యుడికి ప్రభుత్వ వైద్య సేవలను చేరువచేసి ప్రభుత్వ ప్రతిష్టను పెంచాలని ప్రభుత్వం వైద్యాధికారులకు సూచిస్తుండగా కొందరు వైద్యాధికారులు తీరుతో ప్రభుత్వానికి మచ్చ తీసుకొచ్చే సంఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. తాజాగా నాగులుప్పలపాడు మండలం తిమ్మసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీకి ప్రసవం చేసేందుకు ఇక్కడి వైద్యులు సిబ్బంది ఏమాత్రం జాగ్రత్తలు తీసుకోకుండా తమ ఇష్టారాజ్యంగా వ్యవహరించి చేతులెత్తేయడంతో మరో ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ముందు వైద్యం చేసిన వైద్యాధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన అక్కడి వైద్యులు జిల్లా కేంద్రంలోని వైద్యశాలకు తరలించాలని సూచించగా అక్కడికి వెళుతున్న క్రమంలో దళిత కాలనీకి చెందిన నిండు గర్భిణీ మృతి చెందిన సంఘటన జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు మేరకు తిమ్మసముద్రం దళిత కాలనీకి చెందిన తేళ్ల చిన్న బాబు, సంధ్య (27) భార్యా భర్తలు. వీరికి ఇద్దరు మగ పిల్లలు. ప్రస్తుతం సంధ్య 9వ నెల గర్భిణీగా ఉండగా ఈనెల 17న ఉదయం గ్రామంలోని ఆశా వర్కర్ మరియమ్మతో కలిసి గ్రామంలోని ప్రాథమిక వైద్యశాలకు సాధారణ పరీక్షల కొరకు రాగా అక్కడ విధుల్లో ఉన్న ప్రభుత్వ వైద్యురాలు, వైద్య సిబ్బంది సంధ్యను పరీక్షించి పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయని మరికొద్ది సేపట్లో తాము వైద్యశాలలో సుఖ ప్రసవం చేస్తామని చెప్పి సంధ్యను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే ఉంచి ఆశా వర్కర్ మరియమ్మను అక్కడినుండి పంపించేశారు. ఉదయం 11 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు స్థానిక ప్రభుత్వ వైద్యురాలు ఎం ప్రసన్న సూచనల మేరకు స్టాఫ్ నర్స్ స్వరూప రాణి అక్కడి వైద్య సిబ్బంది గర్భిణి సంధ్యకు ప్రసవం చేసేందుకు అనేక విధాలుగా ప్రయత్నాలు చేస్తున్న తరుణంలో సాయంత్రం పొలం పనులకు వెళ్లిన సంధ్య కుటుంబ సభ్యులు బంధువులు విషయం తెలుసుకొని ప్రాథమిక వైద్యశాల వద్దకు చేరుకొని ఏం జరుగుతుందని ప్రశ్నించగా ఇక్కడ మీరు ఏం మాట్లాడొద్దు బయటికి వెళ్ళండి అంటూ బంధువులను కుటుంబ సభ్యులను వైద్య సిబ్బంది బయటకు వైద్యశాల నుండి పంపించేశారు. కొద్దిసేపు అయిన అనంతరం సంధ్యకు తీవ్ర రక్తస్రావం కావడంతో ఆందోళనకు గురై చేయి దాటి పోయిందని గ్రహించిన వైద్యాధికారి ప్రసన్న, స్టాఫ్ నర్స్ స్వరూప రాణి ఇతర వైద్య సిబ్బంది సంధ్యను చీరాలలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లాల్సిందిగా బంధువులకు సూచించడంతో హుటాహుటిన చీరాల తరలించగా అక్కడ పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని ఒంగోలు తరలించాలని సూచించారు. అంబులెన్స్‌లో సంధ్యను ఒంగోలు తరలిస్తున్న క్రమంలో తీవ్ర రక్తస్రావంతో మార్గమధ్యలో మృతి చెందింది. సంధ్య భర్త చినబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న స్థానిక ఎస్సై ఉయ్యాల హరిబాబు మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగిం చారు. ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యంతోనే సంధ్య మృతి చెందిందని మృతదేహంతో తిమ్మసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్ద ఎత్తున చేరుకొని ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం వైద్యాధికారుల నిర్లక్ష్యంతోనే సంధ్య మృతి చెందిందని తమకు న్యాయం చేయాలని కోరారు. విషయం తెలుసుకున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు విధులకు కూడా గైర్హాజరయ్యారు. దీంతో ఒంగోలు వన్ టౌన్ టూ టౌన్ రూరల్ సిఐలు వెంకటేశ్వర్లు, జగదీష్, రాంబాబు తోపాటు ఎస్ఐలు ఉయ్యాల హరిబాబు ఆంజనేయులు, అంకమ్మరావు కృష్ణయ్య, పోలీస్ సిబ్బంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్దకు చేరుకొని ఆందోళన చేస్తున్న వారిని శాంతింప చేసే ప్రయత్నం చేశారు. కొద్దిసేపు పోలీసులకు బాధితులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ మృతదేహంతో బయటాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళన కొనసాగించారు.

ప్రజా బలంతో గెలవాలన్నదే నా లక్ష్యం

- మాజీ ఎమ్మెల్యే ఉగ్ర

విశాలాంధ్ర-కనిగిరి : ప్రజాబలంతో గెలవాలన్నది తన లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. గురువారం ఇటీవల కనిగిరి నియోజకవర్గంలో నిర్వహించిన 'రాష్ట్రానికి ఇదేం కర్మ' ప్రజాభిప్రాయ సేకరణ పత్రులను ఒంగోలు తెలుగుదేశం పార్టీ ఆఫీస్‌కి తరలించారు. ఉగ్ర మాట్లాడుతూ ప్రజలకు సేవకుడిని.... సేవ చేయాలన్న ఆశయంతో అధికారం ఉన్నా... లేకపోయినా ప్రజల్లోనే ఉంటున్నానని తెలిపారు. ప్రతి ఒక్క కార్యకర్త ఈ 10 నెలలు ప్రజల్లో ఉంటూ కష్టపడితే.... విజయం సాధించవచ్చని సూచించారు. తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు కనిగిరి నియోజక వర్గంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో తిరిగిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షులు షేక్ ఫిరోజ్, సీనియర్ నాయకులు దొడ్డ వెంకట్‌రెడ్డి, ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా రైతు సంఘం నాయకులు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నంబుల వెంకటేశ్వర్లు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి ఆర్థికసాయం

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తి పట్టణంలోని చాకలి పాలెం నందు నూతనంగా నిర్మిస్తున్న చర్చి నిర్మాణం కొరకు ఈఎంసి మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్బంగ పాస్టర్ శ్యామ్ కుమార్ మారం వెంకారెడ్డికి అభినందనలు తెలియజేసారు.

ఆదివాసీ మహిళలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన

విశాలాంధ్ర-దర్శి : దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో దర్శి మండలం సామంతుపూడి గ్రామం రైతు భరోసా కేంద్రంలో గురువారం దళిత ఆదివాసీ మహిళలకు సంక్షేమ అభివృద్ధి పథకాలపై అవగాహన సదస్సు మండల స్థాయిలో నిర్వహించడం జరిగింది. దర్శి కోఆర్డినేటర్ గుంటూరు నాగమణి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి సచివాలయ సిబ్బంది ఏఎన్ఎం విశాలాక్షి ఇంజనీరింగ్ అసిస్టెంట్ ధనలక్ష్మి మహిళా పోలీస్ రమ్య ప్రియ వివోఏ సిపోరా అంగన్వాడి టీచర్ మల్లీశ్వరి పాల్గొన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ ధనలక్ష్మి మాట్లాడుతూ జగనన్న హౌస్ సైట్స్ గురించి అలాగే కాలనీలు కట్టుకునే వారికి అప్లికేషన్ పెట్టుకుంటే వారికి బిల్లులపై అవగాహన ఎలాగా అప్లై చేసుకోవాలి అనేది జగనన్న ప్రవేశపెట్టిన పథకాలపై అవగాహన కల్పించడం జరిగింది. తదుపరి రమ్య ప్రియ మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను దిశ యాప్ అత్యాచారాలు పై గృహ గృహహింసపై అవగాహన కల్పించడం వారు ఆ సమస్యలను ఎలా ఎదుర్కోవాలో సమాచారం ఎవరికి ఇవ్వాలో దానిపై ఉన్న అవకాశాలపై చెప్పడం జరిగింది ఏఎన్ఎం విశాలాక్షి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకుంటే పిల్లలు అనారోగ్యాల పాలవుతారని అనేక రోగాలు వస్తాయని అందరూ బాగా చదువుకొని అభివృద్ధి చెందినట్లయితే చదువు అనేది చాలా గొప్పది అని అందరూ పరిశుభ్రంగా ఉండాలి మంచి ఆహారాన్ని తినాలి ప్రతి ఒక్కరు హెల్తీగా ఉండాలి ఏ సమస్యలు అనారోగ్యాలు వచ్చిన మాకు తెలియచేయండి అని ఆమె అన్నారు. తదుపరి వివోఏ సిపోరా మాట్లాడుతూ గ్రామములో స్త్రీ నిధి ఉన్నతి ద్వారా ద్వారా ఎన్నో అవకాశాలు ఉన్నాయి. గ్రూపులలో ఉన్నటువంటి వారు సక్రమంగా లోన్లు రుణాలు కట్టుకున్నట్లయితే సున్నా వడ్డీలు పొందుకుంటారు అని శ్రీనిధి ద్వారా ఒక్కొక్కరికి 50 వేల రూపాయలు రుణం పొందవచ్చు అని అలాగే ఉన్నతి ద్వారా గేదెలు గొర్రెలు కోళ్ల వివిధ రకాల ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టుకోవచ్చని మహిళలకి ఎన్నో అవకాశాలు ఉన్నాయని లక్ష నుండి 20 లక్షల వరకు లోన్ పొందవచ్చు. వివిధ రకాల యూనిట్స్ పెట్టుకోవచ్చు. బేకరీలు ఇస్తరాకులు తయారీ పచ్చళ్ళు తయారీ ఇలాంటి యూనిట్స్ ఎన్నో ఉన్నాయి. మీరు గ్రూపులను సక్రమంగా కట్టుకున్నట్లయితే ఇలాంటి అవకాశాలన్నీ పొందుకోవచ్చు అని గ్రూపుల్లో లేనివారు గ్రూపులను తయారు చేసుకొని బ్యాంకు రుణాలు పొందవచ్చు అని ఆమె అన్నారు.

గాలివాన బీభత్సం

విరిగిపడిన చెట్లు, విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ వైర్లు

విశాలాంధ్ర-పుల్లలచెరువు : మండలంలో గురువారం ఈదురు గాలులు, వర్షం భీభత్సం సృష్టించింది. భయంకరమైన ఈదురుగాలులు ప్రజలను భయ భ్రాంతులకు గురిచేసింది. వర్షం నామమాత్రంగా కురిసినా ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. చెట్లు కూలిపోయాయి. రోడ్లపైనే విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చెట్లు కూలిపోయాయి. విద్యుత్ తీగలు తెగి కిందపడిపోయాయి. ఇళ్లు, షెడ్లపై ఉన్న రేకులు లేచిపోయాయి. బంకులపై చెట్లు విరిగిపడ్డాయి. రేకుల షెడ్లు పడిపోయాయి. ఇంత పెద్దగా ఈదురు గాలులు వీచడం ఇదే మొదటిసారని గ్రామస్థులు తెలిపారు.

వివాహ రిసెప్షన్‌కు తులసి సీడ్స్ అధినేతని ఆహ్వానించిన ఆకుపాటి

విశాలాంధ్ర-పామూరు : పట్టణంలో ఈ నెల 31వ తేదీన జరిగే ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆకుపాటి రమణయ్య కుమారుడు డాక్టర్ ఆకుపాటి కిషోర్ వివాహ రిసెప్షన్‌కు హాజరై వధువరులను ఆశీర్వదించా లని ప్రముఖ పారిశ్రామికవేత్త తులసి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత తులసి రామచంద్ర ప్రభును పట్టణ రెండవ ఎంపిటిసి ఆకుపాటి వెంకటేష్ మిత్రబృందం ఆహ్వానించారు.

వెలిగండ్లలో దారుణ హత్య

- చంపి రోడ్డు పక్కనే పడేసిన దుండగులు
- స్నేహితుడే సూత్రధారిగా బంధువులు అనుమానం
- త్వరలోనే పట్టుకుంటాం : ఎస్సై

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండలం జిల్లెళ్లపాడు రోడ్డు వద్ద హత్య చోటుచేసుకుంది. బుధవారం అర్ధరాత్రి మండలంలోని జిల్లెళ్లపాడుకు చెందిన టీ.వీ రాధ(35)కు నల్గొండ జిల్లా కోదాడకు చెందిన సాఫ్ట్ వేర్ ఉద్యోగి కోట మోహన్‌రెడ్డితో వివాహం జరిగింది. వీరిద్దరూ హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఆదివారం గ్రామంలో జరిగే చౌడేశ్వరి ఉత్సవాలకు పుట్టినిల్లుకు వచ్చింది. సాయంత్రం వ్యక్తిగత పనులు నిమిత్తం కనిగిరి వెళ్తున్నట్లుగా సమాచారం ఇచ్చి వెళ్ళింది. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు సమాచారం ఇవ్వగా సెల్‌ఫోన్ ఆధారంగా విచారించగా జిల్లెళ్లపాడు అడ్డరోడ్ వద్ద ఉన్నట్లుగా గుర్తించారు. అక్కడకు అర్ధరాత్రి వెళ్లి చూడగా రాధ మృతదేహం కనిపించింది. పోలీసులు సంఘటనాస్థలంకు చేరుకుని విచారిస్తు న్నారు. హత్య జరిగి ఉంటుందనే భావిస్తున్నట్లు పూర్తి విచారణ అయిన తరువాత ఎలా జరిగింది అనేది తెలియజేస్తామని పోలీసులు తెలిపారు. అయితే రాధను ఇదే మండలం గండ్లోపల్లికి చెందిన ఓ వ్యక్తికి, రాధకు నగదు లావాదేవీలు ఉన్నట్లు ఈ నేపథ్యంలో నగదు ఇస్తానని అప్పు తీసుకున్న వ్యక్తి రాధ సెల్ ఫోన్‌కు మెసేజ్ చేయడంతో వెళ్లిందని ఆ తరువాత మృతదేహం ఉన్నట్లు గుర్తించామని తండ్రి మేడం సుధాకర్ తెలిపారు. నగదు అప్పుగా తీసుకున్న గండ్లోపల్లికి చెందిన వ్యక్తి హత్య చేసి ఉంటాడని తండ్రి సుధాకర్, స్థానికులు అనుమానిస్తున్నారు. త్వరలోనే నిందితుని పట్టుకుంటామని ఎస్సై మహేష్ కుమార్ తెలిపారు.

బాలుడికి వైద్యఖర్చులు అందించండి

కలెక్టర్‌కు వినతి

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : మల్టీ సిస్టం ఇన్ఫ్లమేటరీ సిండ్రోమ్ కవాసకీ వ్యాధితో బాధపడుతున్న బాలునికి వైద్య ఖర్చుల కోసం వారి తల్లిదండ్రులకు జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ గురువారం లక్ష రూపాయల చెక్కును అందించారు. బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు కలెక్టర్ ఈ ఆర్థిక సహాయం అందించారు. ఐదో విడత మత్స్యకార భరోసా పథకం. అమలు కోసం ఈ నెల 16న బాపట్ల జిల్లా నిజాంపట్నానికి ముఖ్యమంత్రి వచ్చినప్పుడు ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం టంగుటూరు గ్రామానికి చెందిన దంపతులు కె.హృదయం సిహెచ్.ఉషారాణి కలిసి తమ కుమారుని అనారోగ్య పరిస్థితిని వివరించారు. ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నామని, ఈ ఖర్చులను భరించే స్థోమత తమకు లేదని చెప్పారు. ప్రభుత్వమే ఆదుకోవాలని ముఖ్యమంత్రిని వారు ప్రాధేయపడ్డారు. వారి బిడ్డ పరిస్థితిని తెలుసుకున్న ముఖ్యమంత్రి చలించిపోయారు. ప్రభుత్వం తరఫున వైద్య సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. దీంతోపాటు తక్షణ ఆర్థిక సహాయంగా లక్ష రూపాయలను అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఉషారాణి, హృదయరంజన్ దంపతులను ప్రకాశం భవనానికి పిలిపించి లక్ష రూపాయల చెక్కును కలెక్టర్ అందించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె శ్రీనివాసులు, డి.ఆర్.ఓ. శ్రీమతి ఆర్ శ్రీలత పాల్గొన్నారు.

సీపీఐలో చేరిన ఖాసింవలి

విశాలాంధ్ర-కనిగిరి : సిపిఎం పార్టీలో జరుగుతున్న నిరంకుశ ధోరణి నచ్చక పార్టీలో ఇమడలేక సిపిఐ పార్టీలో చేరుతున్నట్లు కనిగిరి మున్సిపాలిటీకి చెందిన ఖాసింవలి అన్నారు. ఖాసింవలి సిపిఎం పాతూరు పట్టణ కార్యదర్శిగా, సిఐటియులో నాయకులుగా, ఆంధ్ర ప్రజా నాట్యమండలి కనిగిరి ప్రాంత నాయకుడిగా ప్రధాన భూమిక పోషించిన వ్యక్తిగా సిపిఎం పార్టీలో గుర్తింపు పొందారు. గురువారం కనిగిరి దర్శించే భవన్లో డిహెచ్పిఎస్ జిల్లా కార్యదర్శి పందిటి మోహన్ అధ్యక్షతన జరిగిన సిపిఐ మండల సమితి సమావేశంలో ఖాసింవలి సిపిఐ పార్టీలో చేరటంతో సిపిఐ జిల్లా నాయకులు వై రవీంద్రబాబు, కనిగిరి నియోజకవర్గం సిపిఐ కార్యదర్శి సయ్యద్ యాసిన్ పార్టీ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా యాసిన్ సిపిఐ పార్టీ నిబంధనలు నియమావళి వివరించి ఖాశింవలితో ప్రతిజ్ఞ చేయించారు. సిపిఐ పార్టీ అధికారం, పదవులకు వెంపర్లాడిన పరిస్థితి కనిగిరిలో ఎప్పుడు లేదని వివరించారు. కార్మిక శ్రామిక వర్గం అధికారం రావాలని.. ప్రజల సమస్యల పరిష్కారం కోసం సిపిఐ పార్టీ అహర్నిశలు పోరాటాలు చేస్తుందని వివరించారు. సిపిఐ పార్టీలో క్రమశిక్షణ, శ్రమించి పనిచేయటం, సమచితస్థానం కల్పించడం, పార్టీ సభ్యులను గౌరవించడం ఉంటుందన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు బ్యంగి సుబ్రహ్మణ్యం, ఏఐటియుసి కనిగిరి నియోజకవర్గం అధ్యక్షుడు గుజ్జుల బాలిరెడ్డి, సయ్యద్ మౌలాలి, మహిళా సంఘం జిల్లా నాయకులు జీపి గాయత్రి, శీను, జిల్లా నాయకులు పుట్ట సుబ్బారావు, కనిగిరి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాసర్, కిరణ్, మీరావలి పాల్గొన్నారు.

'వెలుగు'లో..వసూల్ రాణులు

- రుణాల మంజూరులో చేతివాటం
- ఏటా రూ.లక్షల్లో దండుకుంటున్న వైనం
- ఏపీఎంకు తెలియకుండానే ఈ వ్యవహారం జరుగుతోందా..?
- సీసీలు, వీవోఏలు కుమ్మక్కు
- ఫిర్యాదులు అందుతున్నా పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-పీసీపల్లి : పేదరిక నిర్మూలనలో కీలకపాత్ర పోషించాల్సిన వెలుగు సిబ్బంది అవినీతితో అంటకాగు తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను కార్య క్రమాలను ఆదాయ వనరుగా మార్చుకుని అందినకాడికి దండు కుంటున్నారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకులు ఇచ్చే లింకేజీ రుణాలలో కమీషన్లు వసూలు చేస్తూ ఏటా లక్షలాది రూపాయలు సొమ్ముచేసుకుంటున్నారు సిసిలు వివోఏలు కుమ్మక్కై ఈ వ్యవహారాన్ని సాగిస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం తీవ్ర ఆరోపణలకు తావిస్తోంది. మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి చేయాల్సిన డీఆర్డీఏ వెలుగు సిబ్బంది అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారు. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని ఆదాయమార్గంగా మార్చుకుంటున్నారు. స్వయం సహాయక సంఘాల మహిళల అమాయకత్వం అవసరాన్ని ఆసరాగా చేసుకుని వసూళ్ల పర్వం సాగిస్తున్నారు. రుణాలు పొందిన గ్రూపు సభ్యులతో స్వయం ఉపాధి సంబంధించిన యూనిట్లు గ్రౌండింగ్ చేయించి ఆర్థికాభివృద్ధికి చేయూతనివ్వాల్సిన వారు అదనపు ఆదాయమే మార్గంగా ముందుకు సాగుతున్నారు. దీంతో పొదుపు సంఘాల మహిళలు కూడా బ్యాంకుల నుండి తీసుకుంటున్న రుణాలను వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఆశయం నీరుకారిపోతుంది.

బ్యాంకు లింకేజీ రుణాల్లో పర్సంటేజీ

జిల్లాలోని పొదుపు సంఘాలకు ప్రభుత్వం ఏటా వందల కోట్ల రూపాయలు బ్యాంకు లింకేజీ రుణాలు ఇప్పిస్తుంది. దీంతో పొదుపు సంఘాల సమావేశం నిర్వహించుకొని తీర్మానం చేసుకున్నట్లుగా నిర్ధారిస్తూ వెలుగు సిబ్బంది సంతకం చేస్తేనే బ్యాంకులు రుణం మంజూరు చేస్తాయి. ఈ అవకాశాన్ని కొందరు ఆదాయమార్గంగా మార్చుకున్నారు లక్షకు రూ. 2000 నుంచి రూ.3000 రూపాయల వరకు కమీషన్లు వసూలు చేస్తున్నారు. ఇలా ఏటా లక్షలాది రూపాయలు డ్వాక్రా మహిళల నుండి వెలుగు సిబ్బంది బొక్కేస్తున్నారు. వెలుగు సిబ్బంది వసూళ్ల పర్వం గురించి ఆయా సంఘాల సభ్యులు పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం లేదని తీవ్ర విమర్శలకు తావిస్తుంది. పిసిపల్లి మండలంలో నేటికీ అక్రమంగా సిసిల సహాయంతో వీవోఏలు అక్రమంగా డ్వాక్రా సంఘాల నుండి డబ్బులు వసూలు చేయడం జరుగుతుంది. గతంలో మండలంలో గ్రూపుకి 1000 మనిషికి వంద రూపాయలు లెక్కన అక్రమంగా సిసిలు ఆదేశాలతో వివోఏలు వసూలు చేసిన సంఘటనలు ఉన్నాయి. అయితే ఈ విషయం ఆ నోటా ఈనోటా పడి బయటకి రావడంతో పలు పత్రికల్లో కథనాలు రావడంతో వెంటనే తేరుకున్న వెలుగు సిబ్బంది కొందరికి మాత్రమే వారు తీసుకున్న డబ్బులు వెనక్కి ఇచ్చారు. ఇంత జరిగినా పై అధికారులు మాత్రం వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో పైఅధికారులు ఎవరూ చర్యలు తీసుకోకపోవడంతో మాకు ఏమవుతుందిలే..? మాపై చర్యలు తీసుకునే అధికారులు ఎవరున్నారులే..? అనే ఉద్దేశంతో డ్వాక్రా మహిళల దగ్గరనుండి లక్షల్లో డబ్బులు వసూలు చేయడం ఈరోజుకి కొనసాగుతుంది. కొత్తగా గ్రూపు ఏర్పడిన ప్పుడు వారికి బ్యాంకు నుండి రుణం పొందేటప్పుడు వారికి ఇచ్చిన నగదులో రూ 3 వేల నుండి రూ 5 వేల రూపాయల వరకు డబ్బులను వెలుగు సిబ్బంది బొక్కే స్తున్నారు.

ఈ విషయంపై డ్వాక్రా మహిళలు వారిని ఏమీ అడగలేక.. అడిగితే మరలా రుణం పొందేందుకు వీలు ఉంటుందో లేదో... అని భయపడుతూ అధికారులకు ఫిర్యాదు చేయలేక వారిలో వారే ఎటూ తేల్చుకోలేక సిసిలు వివోఏలు అడిగిన కాడికి డబ్బులు ఇచ్చేస్తున్నారు. మండలంలో జరుగుతున్నా వెలుగు సిబ్బంది పై ఉన్నతాధికారులు ఇప్పటికైనా చర్యలు తీసు కుంటారో లేదో వేచి చూద్దాం.

మరోసారి జగన్‌ను సీఎం చేద్దాం

- ఎంపీపీ గంగసాని లక్ష్మీ హుస్సేన్‌రెడ్డి

విశాలాంధ్ర-పామూరు : సచివాలయాలను ఏర్పాటు చేసి లక్షలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అర్హత ప్రామాణికముగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి దక్కిందని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైసిపి అధికారం లోకి మరోసారి రావడం తధ్యమని ఎంపీపీ గంగసాని లక్ష్మి హుస్సేన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మోపాడు రిజర్వాయర్ వద్ద వెలిచియున్న గంగమ్మ తిరుణాల సందర్భంగా బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ పై నుండి ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు గంగసాని హుస్సేన్‌రెడ్డి, జడ్పిటిసి చప్పిడి సుబ్బయ్య, సింగిల్ విండో అధ్యక్షురాలు పువ్వాడి వెంకట సుజాత, వైసీపీ మండల యువజన అధ్యక్షులు పామూరు పట్టణ ఉపసర్పంచ్ యాదాల వెంకట సాయి కిరణ్, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, వివేక విద్యాసంస్థ కరస్పాండ్ కల్లూరి రామిరెడ్డి, గట్ల విజయభాస్కర్‌రెడ్డి, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి తదితరులు గంగమ్మ దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఎండలు మండుతున్నాయి..జర జాగ్రత్త

విశాలాంధ్ర-ముండ్లమూరు : ఎండలు మండుతున్నాయి. ప్రజలు పగటివేల తిరగడానికి భయపడుతున్నారు. ఇలాంటి పరిస్థితులలో అనారోగ్య కరమైన సమస్యలు వచ్చే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వ్యాధుల బారి నుంచి ఎవరికి వారు రక్షించు కోవాల్సి ఉంది. ఇలాంటి సమయంలో పిల్లలు, వృద్ధుల విషయంలో వేసవిని దృష్టిలో పెట్టుకొని అనుసరించాల్సిన జాగ్రత్తలు. వడదెబ్బ ఎండలు విపరీతంగా ఉన్నప్పుడు మనిషి శరీరంతో మెదడులో ఉన్న ఉష్ణోగ్రతను నియంత్రించే కేంద్రం దెబ్బ తినడం వల్ల వడదెబ్బ తగులుతుంది. శరీర ఉష్ణోగ్రతను దాదాపు100 నుంచి110 డిగ్రీల వరకు పెరగవచ్చు. దీనివల్ల మగత, కలవరింతలు, ఫిట్స్, పాక్షికంగా పూర్తిగా అపస్మారక స్థితి, చర్మం పొడిబారటం, వేడిగా ఉండటం,, శరీరంపై చమట పట్టకపోవడం జరుగుతుంది. కొందరిలో విపరీతంగా చెమట పడుతుంది. వడదెబ్బ తగిలిన వారిలో 40% మరణాలు సంభవిస్తాయి. చికిత్స ఇలాు మనిషిని వెంటనే చల్లని ప్రదే శానికి తరలించాలి. శరీర ఉష్ణోగ్రతను102 డిగ్రీల కంటే తగ్గించడానికి చల్లని నీటితో లేదా ఐస్‌తో శరీరాన్ని తుడవాలి. సాధ్యమైనంతవరకు లూజుగా ఉన్న నూలు బట్టలు ధరించాలి. బాధితులకు చల్లని నీరు లేదా ఉప్పు, ఇతర లవణాలు కలిపిన నీటిని తాగించాలి. రోగిని చల్లని గాలి వెలుతురు ఉన్న ప్రదేశంలో ఉంచాలి. తీవ్ర మైన ఎండల వల్ల మనిషి శరీరం లోని ఉష్ణోగ్రతను నియంత్రించే వ్యవస్థ పని చేయకపోవడం వల్ల తీవ్రమైన జ్వరం వస్తోంది. విపరీతంగా వీచే చల్లని గాలి వచ్చే ప్రదేశంలో రోగిని ఉంచాలి. రోగి పరిస్థితిని బట్టి సెలైన్ ద్రావణాన్ని నరాల ద్వారా ఇవ్వాలి. రోగి కాళ్లు కొద్ది ఎత్తుపై ఉంచి తల పల్లంగా ఉండేటట్లు పడుకోబెట్టి చికిత్స చేయాలి. బాధితుడు స్పృహలో లేనప్పుడు హఠాత్తుగా మాట్లాడుతున్నప్పుడు డాక్టర్ను సంప్రదించాలి. పారాసెటమాల్ పారాసెట మాల్ 500 ఎంజి మాత్రాలను నోటి ద్వారా ఇవ్వాలి. స్పృహలో లేనప్పుడు పారాసెటమాల్ 300 ఎంజి మాత్రమే కండరానికి ఇంజక్షన్ రూపంలో ఇవ్వవచ్చు. చిన్నపిల్లల పట్ల జాగ్రత్తలు ఇలా చిన్నపిల్లలను వీలున్నంతవరకు ఎండకు గురి కాకుండా చూడాలి. పిల్లలకు లూజుగా ఉన్న నూలు వస్త్రాలు వేయాలి. కాచి చల్లార్చిన వడపోసిన నీటినే తాగించాలి. శీతల పానీయాలతో జాగ్రత్తలు రోడ్డు పక్కన తోపుడుబండ్లపై లభ్యమయ్యే చౌకబారు రంగులు కలిపిన శీతల పానీయాలు తాగకూడదు. కొన్ని రకాల సీతల పానీయాల్లో ఉపయోగించే ఐస్ తయారీలో వాడే నీరు పరిశుభ్రంగా లేని నీరు వల్ల అనారోగ్యానికి దారితీస్తుంది.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభించిన 'బాలినేని'

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మహబూబ్ ఆధ్వర్యంలో ఒంగోలు పాత కూరగాయల మార్కెట్ వద్ద ఎస్ఎంఎస్ ఫ్రూట్స్ ఆవరణలో మజ్జిగ చలివేంద్రాన్ని మాజీ మంత్రి ఒంగోలు శాసనసభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి చేతులు మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నెలరోజులపాటు దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ మహబూబ్ ఆధ్వర్యంలో ఎండాకాలం ప్రజల దాహార్తి తీర్చడానికి మంచి చిక్కటి మజ్జిగ ఏర్పాటు చేశారని తెలిపారు. గత పది సంవత్సరాలు పైగా ఇబ్బంది పడుతున్న పేదలకు తన వంతు సహకారం అందిస్తున్నాడని ఎండలో ఇబ్బంది పడుతున్న ప్రజలు పాదాచారులకు దాహార్తి తీర్చడానికి చల్లని మజ్జిగ చలివేంద్ర ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ మేయర్ వేమూరి సూర్య నారాయణ (బుజ్జి) కటారి శంకర్, గొర్రెపాటి శ్రీనివాసరావు, కార్పొరేటర్ ఇంతియాజ్, పి కృష్ణారెడ్డి, షేక్ జాని, షేక్ అల్లా బక్షు, జడ శ్రీనివాసరావు, తూము వెంకటరావు, ఎండేటి వెంకట్రావు, షేక్ మౌలాలి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైల్వే లైన్ కోసం తీసుకున్న భూములకు పరిహారం చెల్లించండి

కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని

విశాలాంధ్ర-పామూరు : మండల కేంద్రమైన పామూరులో 163/2 సర్వే నెంబర్‌లో 28 సెంట్లు నా భూమి నీ రైల్వే లైన్ నిర్మాణం కోసం అధికారులు తీసుకొని నష్టపరిహారం కింద 8 లక్షల పదహారు వేల రూపాయలు మంజూరు చేసి ఉన్నారు. ఆ పరిహారమును త్వరగా అందేలా చూడాలని కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ గురువారం తహసిల్దార్ జ్వాలా నరసింహం, ఆర్ఐ ప్రవీణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే తూర్పు కోడిగుడ్లపాడు గ్రామపంచాయతీ పరిధిలో పోతవరం, ఇరిగినేని నగర్, జంగాలపల్లె, కోడిగుడ్ల పాడు, ఎస్సీ కాలనీతో ఐదు గ్రామాలు ఉన్నాయని బరేల్ గౌడ్స్ కు రహదారులు, ప్రహరీలు లేక గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బం దులకు గురవుతున్నారని, త్వరగా సమస్యను పరిష్కరించాలని, తహసిల్దార్ జ్వాల నరసింహంకు దారపనేని విజ్ఞప్తి చేశారు.

టీటీడీ కళ్యాణమండపం మంజురు

విశాలాంధ్ర-పామూరు : మండల కేంద్రమైన పామూరులో టీటీడీ కళ్యాణమండపం మంజూర అయింది. శ్రీ మదన వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో కళ్యాణ మండపం నిర్మాణమునకు టీటీడీ పాలక మండలి సభ్యులు బుర్రా మధుసూధన్ యాదవ్ సహకారంతో రెండు కోట్ల రూపాయలు మంజూరయింది. టీటీడీ కల్యాణ మండపం మంజూరుకు సహకరించిన వైసీపీ మండల అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి, వైసిపి యువజన అధ్యక్షులు, పట్టణ ఉప సర్పంచ్ యా దాల సాయి కిరణ్‌లకు ఆలయ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.

భూముల రీ సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : గ్రామాలలో జరుగుతున్న భూముల రీ సర్వే పరదర్శకంగా నిర్వహించాలని తహసిల్దార్ మహమ్మద్ నయీమ్ అహ్మద్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో సర్వే జరిగే సమయంలో రైతులు దగ్గర ఆధారాలు, వివరాలు సేకరించి గట్లు ప్రకారం విస్తీర్ణం వారికి తెలియజేయాలన్నారు. సర్వేలో ఎలాంటి అవకతవలకు పాల్పడవద్దని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే కార్యాలయానికి వచ్చి సమస్య పరిష్కరించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ జి పుల్లారెడ్డి, రిసర్వే డిప్యూటీ తహసిల్దార్ టి రవికాంత్, సీనియర్ అసిస్టెంట్ పి శేషగిరిరావు, మండల సర్వేయర్ శివప్రసాద్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

వేసవి ఎండలకు నీడనిస్తున్న వేప చెట్లు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మంట మండిస్తున్న వేసవి ఎండలకు మేమున్నామంటూ మండల కార్యాలయ సముదా యంలో ఆఫీసుల వద్ద వేప చెట్లు నీడనిస్తున్నాయి. ఏళ్ల క్రితం నాటిన మొక్కలు నేడు మహావృక్షాలు కావడంతో మండల కార్యాలకు వచ్చు ఉద్యోగుల కు, ప్రజలకు, బాటసారులకు ఎండ వేడి నుండి విముక్తిని కల్పిస్తూ చెట్లు ప్రాధాన్యతను తెలియజేస్తున్నాయి.

ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలకు స్థల పరిశీలన

విశాలాంధ్ర-తాళ్లూరు : మండలంలోని తూర్పు గంగవరం గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీ ఆదివారం జరుగుతున్న ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా స్థల పరిశీలన కొరకు గురువారం దర్శి మాజీ శాసనసభ్యులు నారపుశెట్టి పాపారావు, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్యలు మండలంలోని తూర్పుగంగవరం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గుంటి గంగక్షేత్రంలోని కాపు కళ్యాణ మండపాన్ని ఉత్సవాల కొరకు ఎంపిక చేశారు. సినీ జీవితంలో నందమూరి తారక రామారావు రాముడుగా, కృష్ణుడుగా, దుర్యోధనునిగా ఇతర సాంఘిక చిత్రాలలో నటించి తనదైన శైలిలో ఆంధ్రుల మనసును దోచుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని స్థాపించి అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలుపరిచి గొప్ప నాయకునిగా పేరుగాంచారని అలాంటి ఎన్టీ రామారావు శతజయించి ఉత్సవాలు ఇక్కడ జరపడం సంతోషంగా ఉందని నారపు శెట్టి పాపారావు అన్నారు. ఆ రోజు వైద్య శిబిరం, రక్తదాన శిబిరం, వృద్ధులకు దుస్తుల పంపిణీ తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యవర్గ కార్యదర్శి మానం రమేష్ బాబు, మండలం మాజీ అధ్యక్షులు ఎస్ కొండారెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి గొల్లపూడి వేణు, దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మైనార్టీ అధ్యక్షులు ఎస్కే మీరా మొహిద్దీన్, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కని శెట్టి లక్ష్మీనారాయణ, సుబ్బారెడ్డి, జాస్తి గిరిబాబు, గూడ పుల్లారెడ్డి, చాట్ల సామేలు, గాలి వెంకటేశ్వర్లు, జాష్టి వెంకట్రావు, చింత చిరంజీవి, బొల్ల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

విశాలాంధ్ర-సీఎస్‌పురం : మండల కేంద్రమైన సిఎస్‌పురం గ్రామంలో ఈ నెల 20వ తేదీన జరిగే తన వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదంచాలని సంగిశెట్టి శ్రీనివాసులు బుధవారం శీలంవారిపల్లెలో కదిరి బాబురావు విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కదిరి పార్థసారథిని కలిసి వివాహ ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మన్నేపల్లి కార్తీక్, గుర్రం హరి, పట్నం తిరుపతయ్య, తదితులు పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన జడ్పీటీసీ దద్దాల

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : కనిగిరి సబ్ డివిజన్ పోలీస్ ఆఫీసర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ రత్నాకరం రామరాజును హనుమంతునిపాడు మండల జడ్పీటీసీ డాక్టర్ దద్దాల నారాయణ గురువారం కనిగిరి పట్టణం లోనే గార్లపేట బస్టాండ్ వద్ద ఉన్న డీఎస్పీ కార్యాలయానికి వెళ్లి డీఎస్పీని మర్యాదపూర్వకంగా కలసి ఘనంగా శాలవాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొబ్బిళ్ళ శ్రీనివాసులు, చలువాది నారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం

విశాలాంధ్ర-బేస్తవారిపేట : వేసవి శిక్షణా శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, కథలు చెప్పించడం, చదివించడం, పాటలు పాడించడం, లెక్కలు, డ్రాయింగ్ తదితర అంశాలను నేర్పించడం జరిగింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గురుస్వామి, సీహెచ్ వీ సుబ్బారెడ్డి, 35 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో తాగునీటి కటకట

విశాలాంధ్ర-అర్ధవీడు : స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కనీస అవసరాలైన తాగు నీటి వసతి కరువుయింది. వైద్యశాల పరిసరాలు పచ్చని ఆ చెట్లతోటి ఆహ్లాదాన్ని పంచుతోంది. రంగు రంగుల భవనాలను కోట్ల రూపాయలు వెచ్చించి ఆధునిక సౌకర్యా లతో అదునాతన భవనాలు నిర్మించారు. ఇవన్నీ ఈ ప్రాంత రోగుల సౌకర్యర్థం కోసమే అని చెప్పారు. కానీ రోగులు గొంతు తడుపు కునేదుకు గుక్కెడు మంచినీరు అందుబాటులో లేకపోవడం అమానుషం.

రోజుకు 80నుంచి90వరకు ఓపి నమోదు అవుతుందటం గమనార్హం. అంతే కాకుండా ఈ ఓపి సంఖ్య సర్కారువారి వైద్య సేవలకు వున్న ప్రాధాన్యతను సూచి స్తుంది. ఈ కారణంగా తాగునీటి వసతి కల్పించి రోగులకు ఉపశమనం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

కంప్యూటర్ ఆపరేటరకు సన్మానం

విశాలాంధ్ర-అర్ధవీడు : స్థానిక తహసీల్దార్ కార్యా లయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న బి.సునీల్‌ను రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మా నిచ్చింది. స్థానిక తహ సీల్దార్ కార్యా లయం నుండి రాచర్లకు బదిలీ ఐన సందర్భముగా గురువారం సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో తహసీల్దార్ కె రవిబాబు, డీటీ వెంకటేశ్వర్లు, రీ సర్వే డిటి అక్తర్ నాయబ్ హుస్సేన్, పలువురు రెవెన్యూ సిబంది పాల్గొన్నారు.

రాజయ్య కేసును నీరుగారుస్తారా..?

- గూడూరి ఎరిక్షన్ బాబు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యర్రగొండపాలెంలో చంద్రబాబు పర్యటన సమయంలో రాళ్ళదాడిలో గాయపడి మృతి చెందిన రాజయ్యకు కుటుంబ సభ్యుల అనుమతి లేకుండా పోలీసులు పోస్ట్ మార్టం చేయిస్తున్నారు. విషయం తెలుసుకున్న యర్రగొండపాలెం టీడీపీ ఇంచార్జీ గూడూరి ఎరిక్షన్ బాబు నిరసనకు దిగారు. అనుమతి తీసుకుని చేయిస్తున్నామన్న పోలీసులు, పోస్ట్ మార్టం అని చెప్పలేదని చెప్పిన మృతుని కొడుకు అన్నారని, రాళ్ళు వేసి చంపింది కాకుండా కేసును నీరు కారుస్తారా అని పోలీసులపై ఎరిక్షన్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలి

విశాలాంధ్ర-పెద్దారవీడు : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని మండల సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు, సుంకేసుల సర్పంచి గుద్దెపోగు రమేష్ తెలిపారు. మండలంలోని సుంకేసుల గ్రామ సచివాలయంలో పర్యావరణ పరిరక్షణ పై సర్పంచి రమేష్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కూరగాయలు తేవడానికి లేదా కిరాణా షాపులకు వెళ్లేటప్పుడు బట్టల సంచులనుతీసుకోని వెళ్లాలి, ప్లాస్టిక్ బ్యాగులను వడ రాదని, పగటిపూట విద్యుత్తును వృధా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆర్.పెద్దిరాజు సచివాలయ సిబ్బంది శ్రీను నాయక్, హమీర్ భాష, వెంకటేశ్వర్‌రెడ్డి, పురుషోత్తం, సుభానమ్మ, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

చెప్పులు, గొడుగుల పంపిణీ

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : మండే ఎండల్లో కనీసం చెప్పులు కూడా కొనుక్కోలేని నిరుపేదలకు, అనాధలకు, భిక్షాటన చేసే వారికి చెప్పులు, గొడుగులు పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టడం నిజంగా అభినందనీయమని ఒంగోలు బాపూజీ మార్కెట్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కోడూరి సత్యనారాయణ, శనగపల్లి శ్రీనివాసరావులు ప్రశంసించారు. శివం ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద చెప్పులు గొడుగులు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భగా ఒంగోలు బాపూజీ మార్కెట్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కోడూరి సత్యనారాయణ శనగపల్లి శ్రీనివాస రాములు మాట్లాడుతూ తీవ్రమైన ఎండల్లో చెప్పులు కొనలేని పేదవాళ్లకు చెప్పులను,గొడుగులను పంపిణీ చేయటం నిజంగా గొప్ప కార్యక్రమం అని అన్నారు. రెండేళ్లుగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తూ ఎంతోమంది ఆదరాభి మానాలను చూర కొనటం నిజంగా అదృష్టం అని అన్నారు. శివం పౌండేషన్ చేస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

విశాలాంధ్ర-కంభం : కంభం మండలం హజరత్ గూడెం పంచాయితీ పరిధిలోని గురువారం ఈ పివో ఆర్డీ ఆధ్వర్యంలో అంగన్వాడి కేంద్రాలను మండల స్థాయి పీర్ కమిటీ సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్వాడిలో స్టాక్ రిజిస్టర్, పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వర్మీ కంపోస్ట్ ఎరువు తయారీ కేంద్రంను సందర్శించి తయారీదారులను సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈపి వో ఆర్డీ విజయలక్ష్మి, కంభం పంచాయతీ కార్యదర్శి దేవరశెట్టి. బ్రహ్మయ్య, కంభం పంచాయతీ సర్పంచ్ పల్నాటి. బోదయ్య, హజరత్ గూడెం సర్పంచ్ మహబూబ్ పీరా జేఏసీ మండల కన్వీనర్ మున్నా (డిష్) తదితరులు పాల్గొన్నారు.

సైడ్ కాలువలు నిర్మించాలి

విశాలాంధ్ర-కంభం : స్థానిక అర్బన్ కాలనీలో సైడు కాలువలు నిర్మించాలంటూ కాలనీ వాసులు గురువారం సచివాలయం - 4 కార్యదర్శి పి కృష్ణమోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తి చేసి ఏళ్లు గడుస్తున్నా సైడు కాలువల ఊసే లేదు. గతంలో వర్షం పడి ఇళ్లలోకి నీరు చేరి నిత్యావసర సరుకులు, బట్టలు తడిసిపోయినవి. ఇళ్లల్లో చేరిన వర్షం నీటిని మోటర్ల సాయంతో బయటికి వదిలారు. ఇలాంటివి మరల పునరావృతం కాకుండా ఉండాలంటే సైడ్ కాలువలు నిర్మించాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా తాత్కాలిక ఉపశమనం తప్ప శాశ్వత పరిష్కారం జరగడంలేదని ఆరోపించారు. వచ్చే వర్షా కాలానికైనా సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చేయాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ కాలనీ వాసులు షేక్ బాబు, మద్దిలేటి, ఏ.బ్రహ్మం, ఏ.బాల,బి.నగమయ్యా చారి, షేక్.నూర్జహాన్, లక్ష్మీ ఈశ్వరమ్మ, పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఎండల తీవ్రం - అప్రమత్తంగా ఉండాలి

సీనియర్ మెడికల్ వైద్యాధికారి డాక్టర్ షేక్ నాయబ్ రసూల్

విశాలాంధ్ర-గిద్దలూరు : గిద్దలూరు పరిసర ప్రాంతంలో ఉష్ణోగ్రతల తీవ్రత రోజు రోజుకు అధికంగా నమోదవుతున్న దష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీనియర్ మెడికల్ వైద్యాధికారి డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ ప్రజలకూ సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ మాట్లాడుతూ వడగాలులు వీస్తున్నందున ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెల్లాలంటే తగు జాగ్రత్తులు తీసుకోవాలన్నారు. వడదెబ్బ లక్షణాలు వడదెబ్బ తగిలిన వారికి విపరీతమైన జ్వరం, నాడి వేగంగా కొట్టుకోవడం, తలనొప్పి, చికాకు,కండరాల నొప్పి, ముదురు రంగులో మూత్రం రావడం,చర్మం పొడిబారడం,స్పృహతప్పి పడిపోవడం వంటి లక్షణాలు ఉంటాయి.ముందు జాగ్రత్తలు సాధ్యమైనంత వరకు

మధ్యా హ్నాం ఎండలో తిరగకుండా ఉండాలి. అత్యవసర పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే మాత్రం తలపై టోపీ లేదా రుమాలు ధరించాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, ఉప్పుతో తయారుచేసిన పండ్ల రసాలు తాగాలి. నల్లటి దుస్తులకు దూరంగా ఉండాలి.ఇంటి గదుల్లో ఉష్ణోగ్రతలను తగ్గించేందుకు కిటికీలు, తలుపులకు తెరలను వినియోగించాలి. చేయాల్సిన ప్రథమ చికిత్స వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడ ప్రదేశానికి మార్చాలి. శరీరంపై ఉండే దుస్తులను తొలిగించి చల్లటి నీటిలో కడగాలి.ఐస్ ముక్కలను గుడ్డలో ఉంచి శరీరమంతా రుద్దితే ఉపశమనం కలుగుతుంది. శరీరానికి చల్లటి గాలి తగిలేలా చూడాలి.రోగగ్రస్తులకు చల్లటి నీరు, ఉప్పు కలిపిన నీటిని తాగించాలి. చికిత్స చేయించాలి వడదెబ్బ తగిలిన వారిని వెంటనే సమీపంలోని దవాఖానకు తరలించి చికిత్స చేయించాలి.మధ్యాహ్నం బయటకు రావడం తగ్గించుకోవాలి. తప్పనిసరి అయితే మాత్రం నెత్తిపై కచ్చితంగా టోపీ,రుమాలు ధరించాలి. వడ దెబ్బ తగిలిన వారిని వెంటనే దవాఖానకు తరలిస్తే వారి ప్రాణాలను కాపాడిన వారవుతారు.

రాజయ్య మృతికి మంత్రి సురేష్ బాధ్యత వహించాలి

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యర్రగొండపాలెంలో చంద్రబాబు పర్యటనపై జరిగిన రాళ్ల దాడిలో గాయపడి మృతి చెందిన రాజయ్య మృతికి కారణం మంత్రి ఆదిమూలపు సురేష్ అంటూ టీడీపీ జిల్లా అధ్యక్షులు నూకసాని బాలాజీ మండిపడ్డారు. ఆరోజు ప్రశాంతంగా సాగుతున్న రోడ్ షోలో మంత్రి అనుచరులు రాళ్లు వేయడం వల్లే రాజయ్య మృతి చెందడం జరిగిందని తెలిపారు. దళితుల పట్ల కపట ప్రేమ చూపి దళితుల హత్యలకు కారకుడుగా మంత్రి సురేష్ ఉంటున్నారని ధ్వజమెత్తరు. రాజయ్య కుటుంబానికి సురేష్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే మంత్రిపై కేసు పెట్టి అరెస్టు చేయాలన్నారు. రాజయ్య మృతి పట్ల టీడీపీ నేతలు నివాళులర్పించారు. చంద్రబాబు రాజయ్య కుటుంబానికి ఆర్థిక సాయంగా రూ.10 లక్షలు ప్రకటించారు. కందుకూరు టీడీపీ ఇంచార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.50వేలు వారి కుటుంబానికి అందజేశారు. నూకసాని బాలాజీ, టీడీపీ ఇంచార్జ్‌లు గూడూరి ఎరిక్షన్ బాబు, ఇంటూరి నాగేశ్వరరావు, ఉగ్ర నరసింహా రెడ్డి పాల్గొన్నారు.

ముడియాల యక్షిత్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో కదిరి బ్రదర్స్

విశాలాంధ్ర-సీఎస్‌పురం : మండలంలోని శీలంవారిపల్లి గ్రామానికి చెందిన ముడియాల గోపి కుమారుడు యక్షిత్‌రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం రాత్రి జరిగాయి. ఈ వేడుకలలో కదిరి బాబురావు విద్యాసంస్థల చైర్మెన్ కదిరి ప్రకాశ్‌రావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కదిరి పార్థసారథి పాల్గొని యక్షిత్‌రెడ్డిని ఆశీర్వదించి జన్మదిన శుభకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సత్యనారయణ, సర్పంచ్ షేక్ బుజ్జి, మాజీ ఎంపిటిసి సభ్యులు మునగల నారాయణరెడ్డి, ఉప సర్పంచ్ టి బాబురావు, షేక్ ఖజావలి, కొట్టే శ్రీను, స్కూల్ చైర్మెన్ ఇరగని మాధవ రావు, సంగిశెట్టి పిరయ్య, గొను రాజశేఖర్‌రెడ్డి, పట్నం తిరుపతయ్య, మూరం సుబ్బారెడ్డి, కాశయ్య పాల్గొన్నారు.

స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ సమగ్రంగా తయారు చేయాలి

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : సాధారణ ఎన్నికలకు సంబంధించి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్.ఓ.పి.)లను సమగ్రంగా తయారు చేయాలని కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం వివిధ ఎన్నికల అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సి.ఈ.ఓ) ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సి.ఈ.ఓ. మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపులకు వచ్చిన అర్జీలను ఈ నెల 24వ తేదీలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 31న సప్లిమెంటరీ జాబితాను పబ్లిష్ చేయాలని చెప్పారు. ఈ.ఆర్.ఓ.నెట్ 2.0కు సంబంధించి పబ్లిక్ ఎన్రోల్మెంట్ పై ఓటర్లకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన చెప్పారు.